తెలంగాణ స్మృతివనం ఏర్పాటుకు చొరవ చూపండి..



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన సభ్యులు

బంజారాహిల్స్: తెలంగాణ లిబరేషన్ స్మృతివనాన్ని 100 ఎకరాల్లో ఏర్పాటయ్యేలా చొరవ చూపాలంటూ 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి ఆధ్వర్యంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నివాసంలో సమితి అధ్యక్షుడు మేచినేని కిషన్‌రావు, సెక్రటరీ జనరల్ దుశర్ల సుదర్శన్‌రావులు కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో తాము ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిలకు వినతిపత్రాలను అందజేయడం జరిగిందని వివరించారు. స్మృతివనం ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు.

ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించిన నాయకులు

ఆల్విన్‌కాలనీ: కామాక్షి బ్రాహ్మణ సంఘం, నిజాంపేట శాఖ ఆధ్వర్యంలో 32 మంది నిరుపేద బ్రాహ్మణ విద్యార్థినీ, విద్యార్థులకు 6 లక్షల రూపాయలు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట రోడ్డులో సంఘం కార్యాలయంలో పలువురు దాతల తోడ్పాటుతో ఈ ఉపకార వేతనాలను అందించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు రాళ్లపల్లి కరుణాకర్ మాట్లాడుతూ ప్రతిభ విద్యార్థులకు చదువుల నిమిత్తం దాతల సాయంతో ఉపకార వేతనాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చుండూరు విజయసారథి, సుధాకర్, పారానంది శంకర్, భువనేశ్వరి, రమణి, లక్ష్మీనారాయణ, రాజయ్య, రామారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు



లింగంపల్లిలో బోనాల ఉత్సవాల్లో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శ్రావణమాస బోనాల వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి లింగంపల్లిలో ఫలహారం బండి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు.యువకుల కేరింతలు, పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, కళాకారుల నృత్యాలతో ఉత్సాహంగా సాగింది. ఈ వేడుకల్లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, అనిరుధ్ యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, రవియాదవ్, పాండు ముదిరాజ్, సురేష్, రేవంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ డే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

చందానగర్ : ప్రపంచ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకొని మియాపూర్ డిజిటల్ ఫొటో స్టూడియో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఫొటో మధుర స్మృతులని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వాల్మీకి, ఉపాధ్యక్షులు రాజు, కార్యదర్శి విజయ్, సంయుక్త కార్యదర్శి గణేష్ యాదవ్, ట్రెజరర్ అన్వర్ ఖాన్, మీడియా పార్టనర్ మహేష్ దావత్, ఏరియా ఇంచార్జి హర్ష, శ్రీను, ఫొటో గ్రాఫర్లు పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రాముఖ్యత ఇవ్వాలి

- 'మనూ' వీసీ సయ్యద్ ఐనుల్ హసన్



సమావేశంలో వీసీ ఐనుల్ హసన్, అతిథులు

రాయదుర్గం: భాషా అధ్యయనాలను అభివృద్ధి చేయడంలో పరిశోధనలకు ప్రాముఖ్యత ఇవ్వాలని మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయంలో ఉర్దూ కల్చర్ స్టడీస్ సెంటర్ (సీయూసీఎస్) ఆధ్వర్యంలో 'భాషలలో పరిశోధనా పద్ధతిపై ఒకవారం పాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్‌లు భాషా రంగంలోని అవసరాలను పరిశోధక విద్యార్థుల అవసరాలను తీరుస్తాయన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ అకడమిక్ ఎక్సలెన్స్‌ను పెంపొందించడంలో పరిశోధనలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. పరిశోధనా పద్ధతుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు అజీజ్‌బాను, సిద్దిఖీమహ్మద్ మహమూద్, మహ్మద్ నసీముద్దీన్‌ఫారిస్, డాక్టర్ ఎండి షబ్బీర్‌అలీ ప్రసంగించారు.

జాతీయ సెమినార్ ప్రారంభం

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తోపాటు రియల్ ఇంటెలిజెన్స్‌ని కూడా ఉపయోగించాలని ఉర్దూ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సూచించారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ శాస్త్ర విభాగం, నింబస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏఐ ఎనేబుల్ డిజిటల్ లైబ్రరీస్- ట్రాన్స్‌ఫార్మింగ్ యాక్సిస్ అండ్ డిస్కవరీ అనే అంశంపై ఒకరోజు జాతీయ సెమినార్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యాబోధనకు సాంకేతికతను జోడిస్తే విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందన్నారు.

బండ్లతో బ్లాక్..

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్.. ట్రాఫిక్ జామ్‌లు

- ఆక్రమణల్లో ఫుట్‌పాత్‌లు.. పాదచారులకు తప్పని ఇబ్బందులు



మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లో రోడ్లపై వాహనాల పార్కింగ్, ఇబ్బందులు పడుతున్న పాదచారులు



జేపీనగర్‌లో..

మియాపూర్: వ్యాపార సముదాయాలకు పార్కింగ్ వసతి లేకపోవడం ట్రాఫిక్‌తో పాటు ప్రమాదాలకు తావిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తుండడంతో ప్రజలు కొనుగోలు చేసే క్రమంలో వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేయడంతో నడిచే దారి లేక పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిష్కరించాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వాహనదారులతో పాటు పాదచారులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక అంతర్గత రోడ్లలో కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేసే వారికి పార్కింగ్ స్థలం లేకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. పార్కింగ్ సౌకర్యం కల్పించని వ్యాపార సంస్థలపై, పార్కింగ్ ఏరియాలో నిర్వహిస్తున్న వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని, దీనిపై సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా జాతీయ రహదారిపై కూడా వాహనాలు పార్కింగ్ చేయడంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

- మియాపూర్, చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్, జేపీఎన్‌నగర్, మయూరీనగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డు, మియాపూర్– బొల్లారం రోడ్డు, ఓల్డ్ మియాపూర్, జాతీయ రహదారి పక్కన సర్వీస్ ఏరియాలలో వ్యాపార సముదాయాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేస్తున్నారు. దీనికి తోడు చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులతో ఆయా కాలనీల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది.
- మియాపూర్, చందానగర్‌లలో రోడ్లన్నీ కుంచించుకుపోతున్నాయి. పలు రహదారులతో పాటు అంతర్గత రోడ్లలో ఆక్రమణల కారణంగా స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. దీనిపై స్థానికులు పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారని వాపోతున్నారు.
- ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో సెలవు దినాల్లో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు రద్దీగా ఉంటున్నాయి. రోడ్లపై వాహనాల పార్కింగ్, తోపుడు బండ్లు తో రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్‌తో సతమతమవుతున్నారు.
- ప్రధాన రోడ్లు, వాణిజ్య వ్యాపార సముదాయాల వద్ద రోడ్లపై విచ్చలవిడిగా వాహనాలు నిలపకుండా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించకుండా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రద్దీ ప్రాంతాల్లో నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసి కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కింగ్ లేని వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రధానరోడ్లలో వ్యాపార సముదాయాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. దీంతో ఆ రోడ్డు వెంబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము.ట్రాఫిక్ పోలీసులు పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తించి చలాన్లు వేస్తున్నారు. కానీ పార్కింగ్ లేని వ్యాపార సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పార్కింగ్ లేని వ్యాపార సంస్థలపై, పార్కింగ్ ఏరియాలో చేస్తున్న వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలి. –మియాపూర్ స్థానికుడు శ్రీకాంత్





ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



ఎమ్మెల్యే గాంధీకి రాఖీ కట్టిన మహిళలు

గచ్చిబౌలి: అన్నా చెల్లెళ్ల అనురాగానికి, అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలను శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే గాంధీ నివాసానికి పలువురు మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, మహిళలు వచ్చి రాఖీలు కట్టారు. అదేవిధంగా మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబాకు బీఆర్ఎస్ మహిళా నేతలు వచ్చి రాఖీలు కట్టారు.



నానక్‌రాంగూడలో..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో వైద్య చికిత్స నిమిత్తం దరఖాస్తు చేసుకున్న ఇద్దరికి మంజూరైన లక్ష ఇరవై వేల రూపాయల చెక్కులను సోమవారం ఎమ్మెల్యే గాంధీ వారికి అందజేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎల్లమ్మబండకు చెందిన సంజీవకుమార్‌కు రూ. 60 వేలు, మహంకాళినగర్‌కు చెందిన నాగశేషుకు 60 వేలు అందజేశామన్నారు. నాయకులు చిన్నోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఎన్‌సీఈటీ ద్వారా 'మనూ' ప్రవేశాలు

రాయదుర్గం: మనూలో నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ)లో అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రవేశాలను కల్పిస్తామని 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ సోమవారం తెలిపారు. ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. బీఎడ్(సెకండరీ) బీఎస్సీ బీఎడ్(ద్వితీయ) బీకామ్ బీఈడీ(సెకండరీ) కోర్సులకు దరఖాస్తులను కోరుతున్నామన్నారు. అభ్యర్థులు ఆగస్టు 25వ తేదీ వరకు అడ్మిషన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

'సోదరీమణులను రక్షించండి'



మాదాపూర్: రక్షాబంధన్ సందర్భంగా సోదరీమణులను రక్షించండంటూ సోమవారం హైటెక్స్‌లో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ సభ్యులు సంఘీభావం తెలిపారు. అధ్యక్షుడు బలరాం బాబు, ప్రధాన కార్యదర్శి రవి, సెక్రటరీ శ్రీరామ్ ముప్పన, టీఈఎఫ్ఏ అధ్యక్షుడు కుమార్‌రాజా, కోశాధికారి సూర్యనారాయణ, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

వరద నీరు నిల్వకుండా..

- సంపుల నిర్మాణంతో సమస్య పరిష్కారం
- ప్రత్యేకంగా నిధులు మంజూరు



పంజగుట్ట కేసీపీ జంక్షన్‌లో నిర్మిస్తున్న సంపు..

బంజారాహిల్స్: వర్షాకాలంలో పలుచోట్ల వరద నీరు నిలిచిపోతూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటమే కాకుండా రోడ్లు పూర్తిగా దెబ్బతింటుండటం సమస్య రోజురోజుకు తీవ్రమవుతుండటంతో దీనికి అడ్డుకట్ట వేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద సంపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భారీ సంపు నిర్మించి ఎప్పటికప్పుడు నీళ్లను తోడి సమీపంలోని నాలాల్లోకి మళ్లించే బృహత్తర కార్యక్రమంను ఇటీవల చేపట్టారు. పురపాలక శాఖ కార్యదర్శి దానకిషోర్ ఇటీవల నిర్మాణంలో ఉన్న సంపులను పరిశీలించారు. అంతకుముందు ఈ ప్రణాళికలను జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఉన్న రొనాల్డ్‌రాస్ రూపొందించారు. వరద నీరు నిలిచిపోతున్న ప్రాంతాల్లో సమస్య పరిష్కారానికి సంపుల నిర్మాణం ఒక్కటే సాధ్యమని భావించిన అధికారులు ఆ మేరకు ఒక్కో సంపు నిర్మాణానికి 1 కోటి రూపాయలు పైగా విడుదల చేసి నిర్మాణాలను చేపట్టారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–17 పరిధిలో నాలుగు చోట్ల ఈ సంపుల నిర్మాణం జరుగుతున్నది. పంజగుట్ట కేసీపీ జంక్షన్, రాజ్‌భవన్ రోడ్డుతో పాటు మరో రెండు ప్రాంతాల్లో వీటిని నిర్మిస్తున్నారు.వర్షం వచ్చినప్పుడు ఈ ప్రాంతాల్లో నడుము లోతు నీళ్లు నిలిచిపోతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని వీటి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

శ్రావణ పౌర్ణమి.. ప్రత్యేక పూజలు, హోమాలు



పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం: శ్రావణ పౌర్ణమి, రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.అన్నపూర్ణాదేవికి పూజలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గణపతి, అష్టలక్ష్మీ,, లలి తా అష్టోత్తర హోమం, శ్రీసూక్త, దుర్గా, రుద్ర, నవగ్రహ హోమాలను వైభవంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆల య మేనేజింగ్ ట్రస్టీ వా సిరెడ్డి పార్వతి, భక్తులు పాల్గొని దేవతామూర్తుల ను దర్శించుకున్నారు.



రాజరాజేశ్వరీమాతకు వెండి చీర అలంకరణ

బంజారాహిల్స్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఫిలింనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరీదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి వెండితో తయారు చేసిన చీరను అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి వేకువజామునే పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపడతాం

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్



ఆదిత్యనగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

చందానగర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పనులు చేపడతామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ అభివృద్ధికి కావలసిన నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు మునాఫ్‌ఖాన్, రహీం, హనీఫ్, మహమ్మద్ ఖాజా, షోయబ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మురుగు సమస్య



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మియాపూర్: మియాపూర్ ఎంఏనగర్ నుంచి శాంతినగర్ కాలనీకి వెళ్లే రోడ్డులో మురుగు పారుతోంది. రోజుల తరబడి మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు రోడ్డుపై ప్రవహిస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ఈ రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులు మురుగు నీటిలో నుండే ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అవార్డు గ్రహీత హెడ్ కానిస్టేబుల్ యాదయ్యకు సన్మానం



యాదయ్యను శాలువాతో సన్మానించిన చైర్మన్ కొండా విజయ్‌కుమార్ తదితరులు

చందానగర్ : రాష్ట్రపతి పోలీస్ మెడల్ అందుకున్న మాదాపూర్ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ యాదయ్యను లయన్స్ క్లబ్, హోప్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొండా విజయ్‌కుమార్ శాలువాతో సన్మానించి రూ.10వేలు ప్రోత్సాహకం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెడ్ కానిస్టేబుల్ యాదయ్య చైన్ దొంగను పట్టుకునే క్రమంలో కత్తిపోట్లకు గురైనప్పటికీ విధి నిర్వహణలో నిబద్ధతను ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ అధ్యక్షులు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి భూషణ్‌రెడ్డి, లయన్ సభ్యులు, మహిపాల్‌రెడ్డి, గోవర్ధన్ గౌడ్, నూకల సందీప్, మారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేయాలి

ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్

రాయదుర్గం: రిజర్వేషన్ లేకుండా లాటరల్ ఎంట్రీ రిక్రూట్‌మెంట్ రాజ్యాంగ హక్కుల ఉల్లంఘననేనని అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం (ఏఐఓబీసీఎస్ఏ) జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ వద్ద ఆయన మాట్లాడుతూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 45 ఉద్యోగాల కోసం జాయింట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ, డైరెక్టర్ స్థాయిలో నేరుగా లాటరల్ ఎంట్రీ ద్వారా నియమించడాన్ని తీవ్రంగా ఏఐఓబీసీఎస్ఏ వ్యతిరేకిస్తుందన్నారు. ఈ నియామకాలలో రిజర్వేషన్ నిబంధనలు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. రిజర్వేషన్ ప్రకారం ఈ 45 పోస్టులలో దళితులు, ఓబీసీలు, ఆదివాసి వర్గాల నుంచి ఎంపిక చేసేవారని గుర్తు చేశారు. ప్రభుత్వం దీన్ని పరిశీలించి, లేటరల్ ఎంట్రీ నియామకాల్లో రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.